
వైరాలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ ఎంఏ రెహమాన్


సత్తుపల్లిలో ఓటు వేసిన మట్టా దయానంద్, వైరాలోని కోస్తాలలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కండకొడిమలో కొండబాల కోటేశ్వరరావు


ఏన్కూరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


కల్లూరురూరల్: ముగ్గువెంకటాపురంలో ఓటు వేసేందుకు బారులు దీరిన మహిళలు


చింతకాని పోలింగ్ కేంద్రంలో..


చింతకాని: ఓటు వేయించేందుకు వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న పోలింగ్ సిబ్బంది


తల్లాడ పోలింగ్ బూత్‌లో..


ముదిగొండ: బాణాపురంలో ఓటే వేసేందుకు వచ్చిన వృద్ధురాలు నాగమ్మ(105), పెద్దమండవలో కోటమ్మ(100)


తల్లాడ: మల్లవరంలో బారులు దీరిన మహిళా, పురుష ఓటర్లు


వైరారూరల్: చంటి బిడ్డతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న మహిళ

ప్రశాంతంగా పోలింగ్

- బారులు దీరిన ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఉత్సాహంగా ఓటు వేసిన యువత
- పలు చోట్ల ఏజెంట్ల ఘర్షణ

వైరా నియోజకవర్గంలో..

వైరా నియోజకవర్గంలో 80.56 శాతం పోలింగ్

వైరా: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వైరా నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగియగా.. 80.56 శాతం పోలింగ్ నమోదైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 86.6శాతం నమోదు కాగా ఈసారి 6.04 శాతం తగ్గింది. ఉదయం 7గంటల నుంచి 9 వరకు 11.65 శాతం, 9 గంటల నుంచి 11 వరకు 32.90, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 53.72, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 3 గంటల వరకు 67.80, 3 గంటల నుంచి 5 గంటల వరకు 77.22 నమోదు కాగా.. మొత్తం 80.56 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే, సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఉండడంతో మండలాల వారీగా శాతాన్ని ప్రకటించలేదు. కాగా, 2014 లోక్‌సభ ఎన్నికల్లో 87.45 శాతం, 2019లో 78.89 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి పెరగడం విశేషం. నియోజకవర్గ కేంద్రంలో 211 పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రంగా, 204 పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ యువకుల పోలింగ్ కేంద్రంగా, 207 కేంద్రాన్ని దివ్యాంగుల మోడల్ పోలింగ్ కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేశారు. వైరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సీపీఎస్ పాఠశాలలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ ఓటు వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు రామసహాయం రఘురాంరెడ్డి, నామ నాగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావు పలు కేంద్రాల్లో పోలింగ్ సరళిపై ఆరా తీశారు. ఇక పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ శ్రేష్ఠ పలువురు అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

వైరారూరల్: వైరా మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని కోస్తాల ప్రాథమిక పాఠశాలలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కొండకొడిమలో విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 244 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ప్యాలెట్ మొరాయించింది. దాంతో ఓటర్లు సుమారు అరగంట వరకు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు ఈవీఎం ప్యాలెట్‌ను మార్చి సమస్యను పరిష్కరించారు.

82.96 శాతం పోలింగ్ నమోదు..

ఏన్కూరు: మండలంలో మొత్తం 27,683 ఓటర్లకు గాను 22,968 ఓట్లు పోలైయ్యాయి. సాయంత్రం 6 గంటలకు ఓటింగ్ పూర్తి కాగా.. 82.96 శాతం ఓటింగ్ నమోదు అయింది. పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ సందర్శించారు.

మండలంలో 84 శాతం పోలింగ్..

కొణిజర్ల: మండలంలో 84శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని అంజనాపురం, తీగలబంజర, పల్లిపాడులో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైంది. కొణిజర్ల పోలింగ్ కేంద్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామ నాగేశ్వరరావు, రామసహాయం రఘురాంరెడ్డి పరిశీలించారు. వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ ఓటింగ్ తీరును పరిశీలించి శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

కారేపల్లిలో 75శాతం పోలింగ్..

కారేపల్లి: లోక్‌సభ ఎన్నికలు కారేపల్లి మండలంలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 61 బూత్‌లకు గాను 75 శాతం ఓట్లు పోలైనవి. సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం ఆధ్వర్యాన పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్త్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 45,011 మంది ఓటర్లు ఉండగా 75 శాతం ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్ని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు ఉదయం నుంచే ఓటు వేసేందుకు బారులు తీరారు. ఉదయం 9 గంటలకు 15.61శాతం పోలింగ్ నమోదు కాగా.. 11 గంటలకు 35.08 శాతం, ఒంటిగంటకు 53.87 శాతం, 3 గంటలకు 67.44 శాతం, 5 గంటలకు 74.42 శాతం, 6 గంటలకు 80.27 శాతం నమోదైంది. గతేడాది నంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 87.43శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 2,43,943 మంది ఓటర్లు ఉండగా.. 1,95,979 మంది తమ ఓట్లను వినియోగించుకున్నారు. సత్తుపల్లి పట్టణంలోని యూపీఎస్ పోలింగ్ కేంద్రంలోని 220 బూత్‌లో ఈవీఎం 40 నిమిషాల పాటు మొరాయించటంతో పోలింగ్‌ను నిలిపివేశారు. కొత్త ఈవీఎంను ఏర్పాటు చేశారు. సత్తుపల్లిలోని బాలికోన్నత పాఠశాలలోని 194 పోలింగ్ బూత్‌లో 20 నిమిషాల పాటు ఈవీఎం మొరాయింటంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, దయానంద్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. సత్తుపల్లి మాజీ జెడ్పీటీసీ సత్యనారాయణ ఆక్సిజన్ సిలిండర్‌తో వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మండలంలో 81 శాతం పోలింగ్..

తల్లాడ: తల్లాడ మండలంలోని 57 పోలింగ్ భూత్‌లకు గాను 81 శాతం ఓట్లు పోలైనవి. తల్లాడ పోలింగ్ స్టేషన్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎంపీ అభ్యర్థులు రామ సహాయం రఘురాంరెడ్డి, నామ నాగేశ్వరరావు, తాండ్ర వినోద్‌రావులు ఎన్నికల సరళిని పరిశీలించారు. తల్లాడ పోలింగ్ భూత్‌ల వద్ద ఏజంట్ల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఎన్నికల సరళిని ఎంపీడీఓ చంద్రమౌళి, తహసీల్దార్ రవికుమార్, సెక్టార్ అధికారులు అశోక్, శ్రీదేవి, తాజుద్దీన్ పరిశీలించారు.

వేంసూరులో 81.63 శాతం..

వేంసూరు: మండలంలో మొత్తం 36,651 మంది ఓటర్లకు గాను 29,920 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేంసూరు మండలంలో 81.63 శాతం నమోదు అయినట్లు తహసీల్దార్ ఎంఏ రాజు తెలిపారు.

చిన్నకోరుకొండిలో మొరాయించిన ఈవీఎం..

కల్లూరురూరల్: మండలంలోని 63వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం ఓటింగ్ మిషన్ మొరాయించటంతో గంటన్నర పాటు పోలింగ్ నిలిపివేశారు. ఉదయం 7 గంటలకే ఓట్లు వేసేందుకు ప్రజలు రాగా ఈవీఎం ఓటింగ్ మిషన్ పని చేయలేదు. దీంతో గంటన్నర పాటు ఉదయం 8.30 గంటలకు పోలింగ్ నిలిపివేశారు. ఎన్నికల అధికారులు వేరే ఈవీఎం మిషన్ తెచ్చి ఓటింగ్‌ను కొనసాగించారు. ఒక్క చిన్నకోరుకొండి తప్ప కల్లూరు మండలంలో మిగిలిన అన్ని గ్రామాల్లో ఈవీఎం ఓటింగ్ మిషన్లు సక్రమంగా పని చేశాయి. ఎటువంటి ఇబ్బందులు కానీ, సాంకేతిక సమస్యలు కానీ ఏర్పడలేదు.

మధిర నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో 81.82 శాతం పోలింగ్

మధిర: ఖమ్మం పార్లమెంట్ ఎన్నికకు సంబంధించి మధిర నియోజకవర్గంలో సోమవారం ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 గంటల వరకు 34.87 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 55.38, 3 గంటల వరకు 68.83 శాతం పోలింగ్ నమోదు అయింది. అదేవిధంగా సాయంత్రం 5 గంటలకు వరకు 78.97, ఆ తర్వాత పోలింగ్ ముగిసే వరకు మధిర నియోజకవర్గం మొత్తం 81.82శాతం పోలింగ్ నమోదైంది.

చింతకానిలో..

చింతకాని: మండలంలో ఉన్నటువంటి 49 పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు పోలింగ్ సిబ్బంది మొత్తం 221 మంది అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. నాగులవంచ పోలింగ్ కేంద్రాన్ని ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సందర్శించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు వైరా ఏసీపీ రెహమాన్ పర్యవేక్షణలో సుమారు 100 మంది పోలీసులు ఎన్నికల బందోబస్తు విధులను నిర్వర్తించినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామంలోని 249 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించింది. మాక్ పోలింగ్ అనంతరం పోలింగ్ ప్రక్రియ ఆరంభించగానే ఈవీఎం పని చేయలేదు. ఆ తర్వాత 45 నిమిషాల తర్వాత అధికారులు ఈవీఎంను సరిచేయడంతో తిరిగి పని చేసింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరూ కూడా పోలింగ్ బూత్‌ల ముఖం చూడలేదు. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్‌లు ఎన్నికల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ఎస్ఐ పి.సురేష్ బందోబస్తు నిర్వహించారు.

బోనకల్: మండలంలోని 22గ్రామాల్లో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ముష్టికుంట్ల, బోనకల్, రావినూతల, మోటమర్రి గ్రామలలోని పోలింగ్ బూత్‌లను బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరావు పరిశీలించారు. రావినూతల పోలింగ్ బూత్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు పరిశీలించారు. ఆళ్లపాడు పోలింగ్ బూత్‌లో.. ఓ వృద్ధురాలి ఓటు విషయంలో వివాదం తలెత్తడంతో ఏజంట్ల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను సమన్వయ పరచడంతో పోలింగ్ యధాతదంగా నడిచింది.

ముదిగొండ: మండలంలోని 55 పోలింగ్ బూతుల లో ఉదయం నుంచి పోలింగ్ మందకోడిగా సాగింది. మండలంలో 80శాతం పైగా పోలింగ్ నమోదు అయింది. వనంవారికిష్టాపురంలోని ఓ పోలింగ్ బూతులో గంట పాటు ఈవీఎం మోరాయించింది. గోకినేపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ పోవడం వలన పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమయిన సిబ్బంది ఫ్యూజ్ వేశారు. ఈ కేంద్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి సందర్శించారు. ముదిగొండ, గోకినేపల్లి, మాదాపురంలోని పోలింగ్ కేంద్రాలను శిక్షణ ఐపీఎస్ అధికారి అవినాష్‌కుమార్ పరిశీలించారు. వల్లభి, పెద్దమండవ, కమలాపురం, బాణాపురం, గంధసిరిలోని పోలింగ్ కేంద్రాలను ఏసీపీ బోజరాజు పరిశీలించారు. మాధాపురంలోని ఓ పోలింగ్ బూతులో ఈవీఎం యంత్రంపై ఓ పార్టీ గుర్తు సమీపంలో ఇంకు ఉండడంతో ఓటర్లు అభ్యంతరం వ్యక్తం చేయగా.. అధికారులు ఇంకును తుడిచి వేశారు. బాణాపురంలో 105ఏళ్ల సామల నాగమ్మ అనే వృద్ధురాలిని వీల్ చైర్‌లో ఓటు వేసేందుకు తీసుకెళుతుండగా కాలికి, చేతులకు గాయాలు అయ్యాయి. పోలింగ్ కేంద్రం ఆవరణలో ఉన్న వైద్యసిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించారు.


బోనకల్: పోలింగ్ కేంద్రం వద్ద మహిళలను పలకరిస్తున్న నామ


మధిరలో..


సత్తుపల్లిటౌన్: బారులు దీరిన ఓటర్లు


ముదిగొండ: పెద్దమండవలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ బోజరాజు


వైరాలో మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు


కారేపల్లి హైస్కూల్‌లో..


కొణిజర్లలో గుర్తింపు కార్డులు చూపుతున్న మహిళలు


బోనకల్: బారులు దీరిన ఓటర్లు


వైరాలో పోలింగ్ కేంద్రం వద్ద టిఫిన్ చేస్తున్న ఎన్నికల సిబ్బంది


ఎర్రుపాలెంలో మాక్ పోలింగ్..


కొణిజర్లలో చంటి బిడ్డలతో ఓటు వేయడానికి వచ్చిన యువతులు


ఎర్రుపాలెంలో బారులు దీరిన ఓటర్లు


సత్తుపల్లి : ఓటు వేసిన బీజేపీ నాయకుడు రామలింగేశ్వరరావు



వేశాం.. తొలి ఓటు!

కొణిజర్ల/సత్తుపల్లిటౌన్:

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో కీలకం. అలాంటి ఓటును పలువురు యువతీ యువకులు తొలిసారిగా వేసి తమ బాధ్యత నెరవేర్చారు. ఉపాధి నిమిత్తం వేరే చోట ఉంటున్న తమకు కొత్తగా వచ్చిన ఓటును వినియోగించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

తొలిసారి ఓటు వేస్తున్నా..



మొట్టమొదటి సారిగా ఓటు వేస్తున్నాను. ఈవీఎంలు ఎలా ఉంటాయి అనేది సెల్‌ఫోన్‌లో చూడటమే మొదటిసారి ఓటు వేయడం చాలా ఆనందంగా ఉంది. మనకు మంచి చేసే వారికి ఓటు వేయాలనుకుంటున్నా. యువతకు ప్రాధాన్యత ఇచ్చే వారికే నా ఓటు.

– తీర్థం నాగచరిత, కొణిజర్ల

చాలా ఆనందంగా ఉంది..



తొలిసారిగా ఓటు వేయడం ఓ తీయని అనుభూతి లాగా ఉంది. ఈవీఎం చూడగానే కొంత ఆందోళనకు గురయ్యాను. కానీ తర్వాత ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నాను. ఓటును నోటుకు అమ్ముకోవద్దు. నిజాయితీ గల నాయకుడిని ఎన్నుకుంటే మంచి జరుగుతుంది.

– దుగ్యాల కావ్య, కొణిజర్ల

ఇదో మంచి అనుభూతి..



మొదటి సారిగా వేశా.. ఈ అనుబూతి ఎప్పటికీ గుర్తుంటుంది. సమర్థుడైన నాయకుడిని ముఖ్యంగా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే నాయకులను ఎన్నుకుంటే మంచిదని నా అభిప్రాయం. ప్రజాస్వామ్యంలో ఓటు విలువైనది కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి.

– పొట్లపల్లి ఝాన్సీ, కొణిజర్ల

యువతే ప్రగతి నిర్ణేతలు..



యువత ఎన్నికల్లో ఓటు వేయడానికి ఈ సారి ఎక్కువ ఆసక్తిని చూపించింది. అందులో నేను ఒకడిని. నేను బీటెక్ చదువుతున్నా. తొలిసారిగా ఓటు వేశాను. చాలా ఆనందంగా ఉంది. దూర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా వచ్చి ఓటు వేసి ప్రజాస్వామ్య విలువను కాపాడాలి. యువతే ప్రగతి నిర్ణేతలు. అది గ్రామల నుంచి మొదలై.. సువిశాల భారతామనికి చేరాలి.

– బి.నాగఆర్తి, సత్తుపల్లి

బెంగళూరు నుంచి వచ్చా..



బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసేందుకు బెంగుళూరు నుంచి వచ్చాను. ఓటు వేసి ఆనందం మాటల్లో చెప్పలేనిది. మంచి నాయకులను ఎన్నుకునేందుకు ప్రజాస్వామ్యంలో ఈ ఎన్నికలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

– దేవబత్తిని హర్షిత, సత్తుపల్లి

గర్వంగా ఉంది..



ఓటు అనేది ఒక మనిషి వ్యక్తిత్వాన్ని చాటి చెబుతుంది. పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా ఎంతో సంతోషంగా ఉంది. యువత ఉత్సహంగా ఓటింగ్‌లో పాల్గొనాలి. ఓటు కోసం చాలారోజులు ఎదురుచూశా. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి.

– అడపా నిత్య, సత్తుపల్లి

సంతోషంగా ఉంది..



పార్లమెంట్ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే అవకాశం లభించటం ఎంతో సంతోషంగా ఉంది. నాతో పాటు స్నేహితులు ఎంతో ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఓటు వేయటం బాధ్యతగా భావించాలి. నాయకులు కూడా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలి.

– ఎస్‌కె గులాంనబీ ఆజాద్, సత్తుపల్లి

న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రభంజనం

వైరా: సీబీఎస్‌సీ పదో తరగతి, 12వ తరగతి ఫలితాల్లో వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాల, న్యూఇరా కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 156 మంది విద్యార్థులు హాజరు కాగా 100 శాతం ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఇందులో 500 మార్కులకు తేజ్ చరణ్ 488 మార్కులు, కె.ఈశ్వర్ 96, భూక్యా ఠాగూర్, ఎ.అన్సిక 95 శాతం మార్కులు సాధించారని, వై.తోషిని శ్రీలక్ష్మి, టి.వివేక్ నందు, బి.సాయిచరిత 94 శాతం, టి.కీర్తన, జి.స్వేచ్ఛ, సీహెచ్.యజ్ఞ త్రివేణి, చావా సాయికృష్ణ 92, యు.అక్షరసిరి, డి.ఉజ్వల్ చౌదరి, ఎ.గౌతమ్ కుమార్ 91 శాతం మార్కులు సాధించారని తెలిపారు. ఇక 12తరగతి పరీక్షలకు 66 మంది విద్యార్థులు హాజరు కాగా 65 మంది ప్రథమ శ్రేణిలో, ఒక విద్యార్థి ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా కుర్రా స్వాత్య 482 మార్కులతో 97 శాతం, కొప్పురావూరి తేజస్విని 95, జ్ఞాన ప్రద్యుమ్న 94, బీరెల్లి వెంకటకృష్ణ 93, వడ్డే శ్రీముఖి 91 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ, కుర్రా సుమన్, లగడపాటి ప్రభాకర్, ప్రిన్సిపల్ షాజీ మాథ్యూ, ఎఓ నర్సింహారావు అభినందించారు.


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో యజమాన్యం

వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ


సత్తుపల్లిలో వెబ్‌కాస్టింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఏఆర్‌ఓ రాజేంద్రగౌడ్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌ను స్థానిక జ్యోతి నిలయం పాఠశాలలోని కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసి వెబ్‌కాస్టింగ్ ద్వారా సహాయ రిటర్నింగ్ అధికారి సీహెచ్ రాజేంద్రగౌడ్ సోమవారం పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో లోపల, బయట పరిస్థితులను గమనిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు తగు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. 25 మంది వెబ్‌కాస్టింగ్ సిబ్బందితో పర్యవేక్షించారు. కాగా.. పోలింగ్ కేంద్రాల వద్ద వేసవి తీవ్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన టెంట్లు, కూలింగ్‌వాటర్, కూలర్లు వంటి సదుపాయాలతో ఓటర్లు సంతృప్తి వ్యక్తం చేశారు.

పటిష్ట పోలీస్ బందోబస్తు..


సత్తుపల్లిలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. సత్తుపల్లి ఏసీపీ ఎ.రఘు, ఏఆర్ ఏసీపీ నర్సయ్య ఆధ్వర్యాన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటంతో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఏడుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 60 మంది హోంగార్డులు, 260 మంది ట్రైనీ కానిస్టేబుళ్లు, 20 మంది ట్రైనీ ఎస్సైలు, 100 మంది కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహించారు.

ఖమ్మం రిసెప్షన్ కేంద్రానికి తరలిన ఈవీఎంలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గంలోని 294 పోలింగ్ బూత్‌లలో సోమవారం రాత్రి పోలింగ్ ముగియటంతో ఈవీఎంలతో పాటు ఎన్నికల సామగ్రిని పోలీస్ బందోబస్తుతో ఖమ్మంలోని రిసెప్షన్ కేంద్రానికి తరలించారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు వరకు ఖమ్మం పాన్నేకల్‌కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలను భద్రపరచనున్నారు.